కురిసింది వాన

● సేదతీరిన ప్రజలు
● వర్షంతో రోడ్లు బురదమయం
● ఉద్యోగులు, వ్యాపారులకు ఇబ్బందులు


శ్రీహరిపురం బస్టాప్ వద్ద ప్రయాణికుల ఇబ్బందులు


యారాడలో కూలిన విద్యుత్ స్తంభం


హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద నిలిచిన వర్షపు నీరు


జలమయమైన రోడ్డు

మల్కాపురం: భానుడి ప్రతాపంతో విలవిల్లాడుతున్న ప్రజలకు వరుణుడు ఉపశమనం ఇచ్చాడు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన తేలిక పాటి వర్షానికి జనం సేద తీరారు. ఒక పక్క తీవ్ర ఎండలు, మరో పక్క ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ ప్రజలు సోమవారం కురిసిన వర్షంతో సంతోషం వ్యక్తం చేశారు. కూల్ కూల్‌గా ఉన్న వాతావరణాన్ని ఎంజాయ్ చేశారు.

ప్రయాణికులకు అవస్థలు

తెరిపి లేకుండా కురిసిన వర్షానికి పారిశ్రామిక ప్రాంతంలో పలు చోట్ల రోడ్లు జలమయం,బురదమయంగా మారాయి. బస్‌సెల్టర్లు లేకపోవడంతో గొడుగులే ఆధారంగా పట్టుకుని వేచి ఉండాల్సిన పరిస్థితి కలిగింది. యారాడ సర్వీసు రోడ్డులో రెండు తాటి చెట్లు విరిగిపడ్డాయి.ఆ చెట్లు సమీపంలోని విద్యుత్ వైర్లుపై పడడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


గోపాలపట్నం జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

ముసురుకున్న వర్షం

గోపాలపట్నం: ఉపరితల ఆవర్తనం వల్ల గోపాలపట్నం, ఎన్‌ఏడీ ప్రాంతాల్లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం సమయంలో ఉద్యోగాలు.. వివిధ పనులకు వెళ్లే వారు అవస్థలు పడ్డారు. కాగా వేసవి తాపంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనం కలిగించింది.


ఎన్‌ఏడీ జంక్షన్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

'పశ్చిమ'లో గెలుపే లక్ష్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు ఎస్‌ఏ రహమాన్


89వ వార్డులో పార్టీ కార్యాలయం వద్ద పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దొడ్డి కిరణ్

● మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్
● ఘనంగా వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఎస్.ఎ.రెహమన్ పిలుపునిచ్చారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని వైఎస్సార్ సీపీ పశ్చిమ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష ఆదరణ లభించిందన్నారు. పార్టీ ప్రతి కార్యకర్త కష్టాన్ని గుర్తించి, తగిన న్యాయం చేస్తుందన్నారు. అనంతరం విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లు ముర్రు వాణి, పి.వి.సురేష్, కొణతాల సుధ, గుండపు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి, పుర్రె సురేష్, దాడి సత్యనారాయణ, సోమాదుల సురేష్, అప్పలస్వామి నాయుడు, గుణశెట్టి శ్రీనివాసరావు, సింహాచలం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, పార్టీ నాయకులు అయితంశెట్టి గోపి, ఆళ్ల పైడిరాజు, నరేష్, కొల్లి నూకరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

– జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లోని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కార్యాలయంలో వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. జియ్యాని శ్రీధర్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు జియ్యాని విజయ్, వెంకటరావు, జియ్యాని మారుతి, తదితరులు పాల్గొన్నారు.

● జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు.

పెందుర్తిలో పుర్రె కలకలం

సింహాచలం: పెందుర్తి కూడలి సమీపంలో విశాఖ నగరానికి వెళ్లే బీఆర్‌టీఎస్ మార్గంలో సోమవారం రాత్రి పుర్రె కనిపించడంతో స్థానికులు బెంబేలెత్తారు. ప్రధాన రహదారి డివైడర్‌పై ఉన్న పుర్రెని చూసిన వాహనదారులు, స్థానికులు భయభ్రాంతులు చెందారు. వెంటనే విషయాన్ని పోలీసులకు తెలిపారు. అది మనిషి పుర్రెగానే భావిస్తున్నారు. కాగా గడిచిన ఆదివారం పెందుర్తి మరిడిమాంబ పండగ సందర్భంగా వేషాలు వేయడానికి వచ్చిన వారు ఈ పుర్రె తీసుకొచ్చారా అని భావిస్తున్నారు.

క్లుప్తంగా

పక్షులకోసం నీటి కుండలు


చెట్లుకు నీటి కుండలు కడుతున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: ఎండలు మండుతున్న నేపథ్యంలో పక్షులు సేద తీరేందుకు చెట్లపై నీటి కుండల్ని గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం గోపాలపట్నం రైతు బజారులో చెట్లకు మట్టి కుండల్లో నీరు నింపి కట్టారు. కార్యక్రమంలో గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ సభ్యులు, పిన్నమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జోన్-5లో 96.2 శాతం పింఛన్ల పంపిణీ


జోన్-5లో పింఛన్ అందిస్తున్న వలంటీర్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని 24 వార్డులకు సంబంధించి టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో సోమవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జోరు వానలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. జోన్ పరిధిలో మొత్తం 26,154 మందికి సుమారు రూ.7.4 కోట్లు పెన్షన్ నగదు అందించారు. సుమారు 96.2 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు టీపీఆర్‌వో ఏపీడీ కె.శైలజ తెలిపారు. ఆయా వార్డుల్లో వలంటీర్లు, సచివాయల వెల్ఫేర్ కార్యదర్శులు ఉదయం నుంచి పెన్షన్ల పంపిణీలో నిమగ్నమయ్యారు. మంగళవారానికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు జెడ్సీ కృష్ణ ఆదేశించారు.

'స్పందన'కు రెండే వినతులు


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు వినతులే అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు 01, పబ్లిక్ హెల్త్ విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫ్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ అధికారి అపరంజిత, పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ కె.శైలజ, సీడీవో పద్మావతి పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి తొలేళ్లు


ఊరేగింపులో ఆకట్టుకున్న వేషధారణలు, ఏనుగు బొమ్మ


ప్రతిమలతో వెళ్తున్న గణబాబు తదితరులు

గోపాలపట్నం: గోపాలపట్నం వాసుల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తొలేళ్ల పండగ ఘనంగా నిర్వహించారు. నూకాలమ్మ ఆలయం నుంచి సోమవారం సాయంత్రం ప్రతిమలను ఊరేగించారు. విచిత్ర వేషధారణలు, కాంతారా వేషధారణ చూపరులను ఆకట్టుకుంది. గోపాలపట్నం ప్రధాన రహదారి మీదుగా పలు వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రతిమలకు విశేష పూజలు చేశారు. ఈ ఊరేగింపులో ఆలయ ధర్మకర్త గణబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంతులీనుతున్న ఆలయం

పైడితల్లి అమ్మవారి పండగ నేపథ్యంలో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయంతో పాటు పలు వీధుల్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మంత్రి అమర్‌నాథ్ దృష్టికి షిప్‌యార్డ్ సమస్యలు

సింధియా: షిప్‌యార్డ్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు సోమవారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మే డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం షిప్‌యార్డ్‌లో నెలకొన్న పలు కార్మిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో కేంద్ర పెద్దలతో మాట్లాడి షిప్‌యార్డ్‌కు సరిపడా ఆర్డర్స్ ఇప్పించి కార్మిక సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. షిప్‌యార్డ్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి చంటిబాబు, నాయకులు మీసాల సత్యనారాయణ, కె.నారాయణరావు, సుధాకర్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.


మంత్రి అమర్‌నాథ్‌తో షిప్‌యార్డ్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు

తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సోమవారం జీవీఎంసీ వాటర్ విభాగ ఏఈ కనకరాజుతో కలిసి విస్తృతంగా పర్యటించారు. మంచినీటి సమస్యలు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు కార్పొరేటర్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. దీంతో సోమవారం అధికారులతో కలిసి పర్యటించిన ఆయన రిజర్వాయర్ నుంచి వచ్చే మంచినీటి సరఫరా పైప్‌లైన్‌ను తనిఖీ చేశారు. సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి మంచినీటి సరఫరా యధావిధిగా జరిగేలా చర్యలు చేపడతామన్నారు. అదే విధంగా ఎస్టీ‌ర్‌కాలనీలో కొత్త మోటారు పంపు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వార్డును అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. వార్డు ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్టు చెప్పారు. వార్డులో అధిక శాతం కొండవాలు ప్రాంతాలు కావడం వల్ల టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని, దీంతో అభివృద్ధి పనులు చేపట్టడంలో ఆలస్యమవుతుందన్నారు. విషయాన్ని పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకవెళ్లామని, త్వరలోనే పబ్లిక్‌వర్క్స్ విభాగ అధికారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నీటి విభాగ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రామరాజు, గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు జూరెడ్డి గంగరాజు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.


తాగునీటి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

విశేషంగా వెంకన్న రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్ తదితరులు


కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా నాలుగోరోజు సోమవారం స్వామివారి రథోత్సవం విశేషంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ ఉత్సవ మూర్తులు వెంకన్న, శ్రీదేవి,భూదేవిలను రథంపై అధిష్ఠింపజేశారు. తప్పెటగుళ్లు, చెక్క భజనలు, కోలాటాలు, గోవిందనామస్మరణ మధ్య సప్తగిరి నగర్‌లోని అలివేలు మంగమ్మ ఆలయం వరకు రథోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ఆనందభరితులయ్యారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వాడవాడలా అరుణ పతాకం రెపరెపలు


కోరమాండల్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి


హెచ్‌పీసీఎల్ గేటు వద్ద వైఎస్సార్ టీయూసీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


ర్యాలీలో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: మే డే వేడుకలను పారిశ్రామిక ప్రాంతంలో పలు ట్రేడ్ యూనియన్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా అరుణ పతాకం రెపరెపలాడింది. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం ఆధ్వర్యంలో మల్కాపురం నుంచి కోరమాండల్ వరకు భారీ ఊరేగింపు చేపట్టారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఇంటక్ అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులను ఎలా మోసం చేస్తుందో వివరించారు. హెచ్‌పీసీఎల్ కళ్యాణి గేటు వద్ద స్థానిక వైఎస్సార్ టీయూసీ నాయకుడు త్రినాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కోరమాండల్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకుడు జె.వి.సత్యనారాయణ(నాని) పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ కార్మికులు, ఏఐటీయూసీ సభ్యులు పాల్గొన్నారు. టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మల్కాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీను, తెలుగు యువత నాయకుడు రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొని యూనియన్ జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో 60వ వార్డు గుల్లపాలెం వద్ద జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ గంగారామ్ పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే

గోపాలపట్నం: ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను సీఐటీయూ గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో నిర్వహించారు. సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద గోపాలపట్నం జోన్ అధ్యక్షుడు బలివాడ వెంకటరావు ఎర్రజెండా ఆవిష్కరించారు. 89, 90, 91, 92 వార్డుల్లో పలు చోట్ల అరుణపతాకాలు రెపరెపలాడాయి. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి పి. అనసూయ, పి వెంకటరావు పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌టీఎల్‌లో సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ఎర్రజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జేఎస్ వర్మ, నాయకులు రెడ్డి వెంకటరావు, నాగభూషణం, రాజు పాల్గొన్నారు.


సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద జెండా ఎగుర వేస్తున్న నాయకులు


ఎన్ఎస్టీఎల్‌లో ...

రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి


రోడ్డుపై అడ్డంగా వేసిన పిక్క

కంచరపాలెం: జీవీఎంసీ 56 వార్డు పరిధిలోని కంచరపాలెం, ఊర్వశికూడలి ప్రాంతాల్లో రహదారికి అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి వేస్తుండడంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంచరపాలెం మెయిన్‌రోడ్డు, దుర్గానగర్, గొల్లకంచరపాలెం, తోటవీధి, గవర కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, మల్లసూరివీధి, గౌరీనగర్, దుర్గానగర్, పల్లీవీధి, చెవిటిరాముల వీధి తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని పలువురు వాపోతున్నారు. ఇరుకు ప్రదేశాల్లో నిర్మాణాలు చేపట్టడంతో అవసరసమైన ఇసుక, పిక్క, ఇటుక వంటి సామగ్రిని రోడ్ల మీద ఇష్టానుసారంగా వేస్తున్నారు. పనులు కూడా అక్కడే చేపట్టడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. సచివాలయాల టౌన్‌ప్లానింగ్ కార్యదర్శుల పర్యవేక్షణ లేకపోవడంతో నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఏసీపీల బాధ్యతల స్వీకరణ


ఏసీపీ సునీల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఐలు

గోపాలపట్నం: జోన్-2 క్రైం ఏసీపీగా బి. సునీల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద ఏసీపీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకున్న ఆయన్ను పలువురు సీఐలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనకాపల్లిలో పని చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ సునీల్ చెప్పారు.


మోసెస్‌పాల్

మల్కాపురం: హార్బర్ ఏసీపీగా మోసెస్‌పాల్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు సీసీఎం విభాగంలో మోసెస్‌పాల్ పని చేశారు. బదిలీపై హార్బర్ ఏసీపీగా వచ్చిన ఆయన సోమవారం షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను మల్కాపురం సీఐ లూథర్‌బాబు ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడి ఏసీపీ శిరీష బదిలీ అయ్యారు.

ఘనంగా ఆర్జిత సేవలు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ తులసీ దళార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు పూజ నిర్వహించారు.

● శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న బిల్డర్లు

సింహాచలం: జీవీఎంసీ జోన్-8 బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పద్మావతినగర్‌లోని వాసుదేవ ఫంక్షన్ హాల్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రక్తదాన శిబిరం నిర్వహించారు. జోన్‌పరిధిలో ఉన్న బిల్డర్లుతో పాటు వారి కుటుంబ సభ్యులు, వర్కర్లు కలిపి 80 మంది రక్తదానం చేశారు. నగరంలోని రోటరీ బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రమణయ్య, ఉపాధ్యక్షుడు ఎస్.రామరాజు, కార్యదర్శి ఎల్.శ్రీనివాసరావు, కోశాధికారి సతీష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.